ఈనాడు
epaper.eenadu.net



పీఆర్టీఎస్...

ట్రాఫిక్ చిక్కులుండవ్.. కాలుష్యం బెడద ఉండదు

హైదరాబాద్ మహానగరంలో మెట్రో రైలు రాకతో... మూడు ప్రధాన మార్గాల్లో ప్రయాణం కొంత సులభమైంది. మెట్రో దిగాక కార్యాలయానికో, ఇంటికో, ఇతర గమ్యస్థానానికో వెళ్లాలంటే మళ్లీ ట్రాఫిక్ సమస్యలు, సరైన ప్రజా రవాణా అందుబాటులో లేకపోవడం, క్యాబ్‌లలో అధిక ధరలతో సమస్యలు చుట్టుముడుతున్నాయి. దీనికి పరిష్కారంగా పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (పీఆర్టీఎస్) లేక పాడ్ ట్యాక్సీల వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. అధ్యయనం తర్వాత కేపీహెచ్‌బీ- బయోడైవర్సిటీ, ఎల్బీనగర్ బస్‌డిపో- రాణిగంజ్, అసెంబ్లీ- బేగంపేట మార్గాలను సీఎం ఎంపిక చేశారు. ఈ మార్గాల్లో పీఆర్టీఎస్‌ను అందుబాటులోకి తేవడానికి డిసెంబరు నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం మెట్రోరైలు అధికారులను ఆదేశించింది.

ఎలా పనిచేస్తుంది?

పీఆర్టీ వ్యవస్థలో పాడ్‌ట్యాక్సీలు నడిపేందుకు ప్రత్యేకంగా ఎలివేటెడ్ ట్రాక్‌లు నిర్మిస్తారు. వాటిపై ఉండే గైడ్‌వేలు (పాడ్ ట్యాక్సీలు తిరిగే మార్గం), ట్రాక్‌లపై టాక్సీలు రాకపోకలు సాగిస్తాయి. ఈ వాహనాలకు డ్రైవర్లు ఉండరు. మెట్రో మాదిరే పూర్తిగా స్వయంచాలకంగా, కేంద్రీకృత కంట్రోల్ వ్యవస్థ ద్వారా నడుస్తాయి. చిన్నగా కారు మాదిరి ఉండే పాడ్‌ట్యాక్సీలో నలుగురు నుంచి ఆరుగురు వరకు ప్రయాణించవచ్చు. ఒకేసారి 15 నుంచి 20 మంది ప్రయాణించేలా గ్రూప్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (జీఆర్‌టీ) వ్యవస్థను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రయాణికులు పాడ్‌కార్ ఎక్కిన తర్వాత అందులో ఉండే టచ్‌పాడ్ సహాయంతో తమ గమ్యస్థానాన్ని ఎంచుకుంటారు.

పర్యావరణ హితంగా..

- మెట్రోస్టేషన్లు, రవాణా కేంద్రాల నుంచి సమీపంలోని ఐటీ పార్కులు, కార్యాలయాలు, నివాస ప్రాంతాలకు చేరుకోవడానికి ఇవి ఉపయోగపడతాయి.
- బ్యాటరీతో నడుస్తాయి కాబట్టి కాలుష్యం బెడద ఉండదు. గంటకు 35 నుంచి 44 కి.మీ. వేగంతో వెళ్లగలవు.

పలు రకాల సాంకేతికతలతో..

- ప్రస్తుతం ప్రపంచంలోని ఆరు ప్రధాన ప్రాంతాల్లో వివిధ రకాల గైడ్‌వేలు, స్టేషన్ల డిజైన్లతో పీఆర్టీఎస్ సేవలు అందుతున్నాయి. భూమిపై నడిచే ట్రాక్‌లతో పాటు గాలిలో కేబుల్స్, పైభాగపు ట్రాక్‌లకు వేలాడుతూ ప్రయాణించే వాహనాలు.. ఇలా 8 విభిన్న సాంకేతికతలతో పీఆర్టీ వ్యవస్థలు ఉన్నాయి. మన దగ్గర ఎలివేటెడ్ ట్రాక్‌ల డిజైన్‌కే అధికారులు మొగ్గుచూపుతున్నారు
- మన దేశంలో తొలిసారిగా ముంబయిలోని బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ)లో 8.5 కి.మీ. పొడవైన ఎలివేటెడ్ పీఆర్టీ ప్రాజెక్ట్ చేపట్టారు. అల్ట్రా పీఆర్టీ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం లండన్‌లోని హీత్రో విమానాశ్రయంలో వాడే సాంకేతికత కూడా ఇదే. యూకేకి చెందిన అల్ట్రా పీఆర్టీతో కలిసి హైదరాబాద్‌కు చెందిన సంస్థే ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టింది.

– ఈనాడు, హైదరాబాద్

మొదటి దశలో కూకట్‌పల్లి నుంచి నాలెడ్జ్ సిటీ వరకు

● 35 కిలోమీటర్లు.. 64 స్టేషన్లతో ప్రతిపాదనలు ● పీఆర్టీఎస్‌పై సీఎస్ సమీక్ష

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లో పీఆర్టీఎస్‌ను మొదటి దశలో కూకట్‌పల్లి, రాయదుర్గం, బయోడైవర్సిటీ మీదుగా నాలెడ్జ్ సిటీ వరకు ఏర్పాటు చేయనున్నారు. 35 కిలోమీటర్ల మేర 64 స్టేషన్లతో దీనికి ప్రతిపాదనలు సిద్ధంచేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం సచివాలయంలో సీనియర్ అధికారులతో దీనిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రాజెక్ట్ గురించి వివరించారు. జంట నగరాల్లో 2030 నాటికి రోజుకు 3.94 లక్షలు, 2040 నాటికి 7.96 లక్షలు, 2050 నాటికి 10 లక్షల మంది పీఆర్టీఎస్‌లో రాకపోకలు సాగిస్తారని అంచనా వేసినట్లు తెలిపారు. సీఎస్ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు సమగ్ర రూట్‌మ్యాప్, కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి.. జీహెచ్‌ఎంసీ, సీఎంసీ, ఎస్పీడీసీఎల్, హెచ్‌ఎండీఏ, పోలీసుశాఖ, జలమండలి, దక్షిణ మధ్య రైల్వే, ఆర్టీసీ, హైడ్రా తదితర సంస్థలకు అందజేయాలని సూచించారు. హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ప్రభుత్వ సలహాదారు (మెట్రో, పట్టణ రవాణా) ఎన్.వి.ఎస్. రెడ్డి, రవాణా, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి ఇలంబర్తి, హెచ్‌ఎంఆర్‌ఎల్ అదనపు ఎండీ అజిత్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ, సీఎంసీ కమిషనర్లు ఆర్.వి.కర్ణన్, స్నజన, ఆర్టీసీ ఎండీ అనిల్‌కుమార్, టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేశ్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్ పోలీసు కమిషనర్లు మహేశ్ భగవత్, రమేశ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, హైదరాబాద్ సంయుక్త పోలీసు కమిషనర్ (ట్రాఫిక్) జోయెల్ డేవిస్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను వీక్షిస్తున్న సీఎస్ సంజయ్ జాజు, వివిధ విభాగాల అధికారులు